క్లుప్తంగా

లోక కల్యాణార్థం రుద్రహోమం

వినుకొండ టౌన్: సర్వలోక కళ్యాణార్థమై సామూహిక రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు హిమాలయ గురూజీ పేర్కొన్నారు. రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో మహారుద్ర హోమం, మృత్యుంజయ హోమం కార్యక్రమాన్ని పట్టణ శివారులోని విఠంరాజు పల్లి సాయి బృందావనం వద్ద సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గురూజీ భిక్షాటన చేయగా యక్కల శ్రీరామ చంద్రమూర్తి, పవన్‌కుమార్ దంపతులతో పాటు మరికొందరు భక్తులు స్వామి జోలెలో భిక్షం అందచేశారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర

రొంపిచర్ల: కర్లకుంట గ్రామంలో నిర్వహిస్తున్న మంతాపెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం నాడు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పొంగళ్లు నిర్వహించి తల్లికి నైవేద్యాలు సమర్పించారు. చివరి రోజు జాతర ఉత్సవాల్లో శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమంతా పెద్దమ్మ తల్లికి డాక్టర్ గోపిరెడ్డి, గ్రామం, నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించారు. జాతరలో పాల్గొనేందుకు వెళిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. జాతర ఉత్సవాల్లో ఆయనతో పాటు నాయకులు దేవళ్ల కోటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు, కురుగుంట శ్రీనివాస రెడ్డి, బత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

సుందరేశ్వరునికి పూజలు



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డు బాలయ్యనగర్‌లోని శ్రీకళ్యాణ సుందరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిపారు. సాయంత్రం శివనామ పారాయణం, మంగళ హారతులు సమర్పించారు. ఆలయ అర్చకుడు కొమ్మాలపాటి మణికంఠశర్మ పూజాదికాలు నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు నాయక్



ఈపూరు: మండల తహసీల్దార్‌గా ఆర్. వెంకటేశ్వర్లు నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న విజయ జ్యోతికుమారి కలెక్టర్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. కలెక్టర్ ఆఫీస్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్. వెంకటేశ్వర్లునాయక్ తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి అందాయి. వెంకటేశ్వర్లు నాయక్ మంగళ, బుధవారాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

యువకుడిపై రాయితో దాడి

నరసరావుపేట టౌన్: స్వల్ప వివాద నేపథ్యంలో యువకుడిపై వ్యక్తి రాయితో దాడికి పాల్పడిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదచెరువుకు చెందిన ఆశి పై ఇస్లాంపేటకు చెందిన రఫీ రాయితో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రహంతుల్లా తెలిపారు.

మసీదుకు భూమిపూజ

నరసరావుపేట: పట్టణంలోని ఒకటో వార్డు ట్రంక్ పెట్టెల బజార్‌లో ముస్లిం సోదరుల కోరిక మేరకు నూతన మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో స్థానిక మైనార్టీ సోదరులు తమ ఏరియాలో మసీదు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు స్థలాన్ని కేటాయించి చేపట్టిన మసీదు నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. మసీదు కావాలని అడిగిన వెంటనే స్పందించి తమకు మసీదు స్థలాన్ని కేటాయించినందుకు వార్డులోని మైనార్టీ సోదరులు ఎమ్మెల్యే గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాబేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్‌భాష, పట్టణ అధ్యక్షులు షేక్ సుభాని, పట్టణ ఉపాధ్యక్షుడు రామిసెట్టి కొండ, వార్డు నాయకలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని వారికి లీగల్ నోటీసులు

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులు జప్తుచేసేందుకు లీగల్ నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర సోమవారం వెల్లడించారు. బకాయి పడిన వారికి పలుమార్లు నోటీసులు, రెడ్ నోటీసులు జారీ చేసినా స్పందించని యజమానులకు పురపాలక న్యాయవాది సూచనతో లీగల్ నోటీసులు జారీ చేశామన్నారు.

దూరం... దూరం!



డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మనందరి లక్ష్యమని ఈపూరు ఎస్ఐ విప్పర్ల వెంకట్రావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. సమాజంలో యువత మత్తు మందులకు బానిసై పెడదోవ పడుతుందని, తద్వారా కుటుంబాలు నాశనమవుతున్నాయని అన్నారు. గంజాయి, మత్తుపదార్థాలకు అలవాటుపడితే వారిపై పోలీస్ కేసులు కూడా నమోదు చేస్తామని సూచించారు.
– ఈపూరు

కానుకల లెక్కింపు



ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.10,47,535లు లభించినట్లు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన లెక్కింపులో ఆలయంలోని హుండీల ద్వారా రూ.9,32,787లు, అన్నదాన హుండీల ద్వారా రూ.1,14,738లు, వెండి 1.147కేజీలు, బంగారం 17గ్రాములు లభించినట్లు తెలిపారు.
–నరసరావుపేట రూరల్

పోషకాహారం పంపిణీ



ప్రభుత్వం గర్భిణులు, బాలింత మహిళల కోసం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని తల్లిపిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశిదేవి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పౌష్టికాహార పంపిణీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న కర్జూరాలు, రాగిపిండి, బెల్లం తదితర పౌష్టికాహారాన్ని తల్లులు తీసుకోవడం వల్ల సమపాళ్ళలో పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కళావతి, ఆయా, పలువురు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. – రొంపిచర్ల

నివాళి



ఏఎంజీ, వేద, ఫార్‌కార్నర్ సంస్థల వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ జాన్‌డేవిడ్ మూడవ అల్లుడు వేద సంస్థల డైరెక్టర్ శ్రీగిరి యోహోయాకిన్ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. ఆయన ఈ నెల 9వ తేదీ గుండెపోటుతో మృతి చెందారు. శ్రీగిరి యోహోయాకిన్ భౌతికకాయాన్ని ప్రజల సందర్శన కోసం గుండయ్యతోటలోని జాన్ డేవిడ్ నివాసంలో ఉంచారు. మంత్రి విడదల రజిని ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.
– చిలకలూరిపేటటౌన్

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంతోషమే

- రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని అభివృద్ధి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



లబ్ధిదారులకు పథకాల వివరాలు అందజేస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లి విరుస్తున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మురికిపూడి గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఎంపీపీ దేవినేని శంకరరావు, గుంటూరు కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఆరుమళ్ల శివ, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, ఎంపీటీసీ సభ్యుడు జమ్మలమడుగు సూర్యప్రకాశరావు, నాయకులు యములయ్య, సూరబోయిన ఆదిలక్ష్మి, మురళి, రాంబాబు, జాష్టి పార్వతి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. పారిశుద్ధ్యాన్ని పట్టించుకోండి!

- ఎమ్మెల్యేగా నేను కష్టపడుతున్నా... మీ కృషి కనపడటం లేదు!
- చెత్తసేకరణ తీరుపై కమిషనర్‌కు ఎమ్మెల్యే క్లాసు



చెత్త పరిస్థితిపై మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు క్లాసు తీసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: 'కమిషనర్‌గారూ.. పట్టణంలో పారిశుద్ధ్యాన్ని పట్టించుకోండి.. ఆఫీసులో కూర్చుని నాలుగు ఫైళ్లపై సంతకాలు పెట్టడమే ఉద్యోగం కాదండి.. ఒక ఎమ్మెల్యేగా నేను కష్టపడినంత కూడా మీరు కష్టపడటం లేదు' అంటూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్రకు క్లాసు తీసుకున్నారు. సోమవారం ఉదయం పురపాలక పరిధిలో పారిశుద్ధ్యంలో భాగంగా చెత్త సేకరణపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించారు. ఈసందర్భంగా ద్విచక్రవాహనాన్ని స్వయంగా నడుపుతూ మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లోని వీధులు, స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కు, గుంటూరు రోడ్డులోని డంపింగ్ యార్డులలో చెత్తను పరిశీలించారు. చెత్త సేకరణపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తూ పరిస్థితి గురించి కమిషనర్‌ను ప్రశ్నించారు. తాను కాన్ఫరెన్స్‌లకు హాజరవుతున్నానని, బాగానే పనిచేస్తున్నానని చెప్పటంతో ప్రయోజనమేముందని, మిగిలిన రోజులైనా పనిచేయాలి కదా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండ్లకి ఆయిల్ కొరవడి చెత్తసేకరణలో జాప్యం జరిగిందని కమిషనర్ చెప్పగా ఆయిల్ గురించి మాట్లాడి సెట్ చేశానని ఎమ్మెల్యే చెప్పారు. వచ్చే రెండురోజుల్లో మొత్తం శుభ్రం చేయిస్తామన్నారు. చెత్తను వేసే వారికి నోటీసులు ఇస్తామన్నారు. శివరాత్రి పండగను దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ డైరెక్టర్ పద్మావతి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

నాదెండ్ల: బాలల హక్కుల పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పాటుపడాలని ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ డైరెక్టర్ బత్తుల పద్మావతి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా, వైద్యరంగం బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. బాలల అక్రమ రవాణా, చిన్నారులపై జరుగుతున్న వేధింపులను పెద్దలు, ఉపాధ్యాయులు నివారించాలన్నారు. బడి మానేసిన చిన్నారులను తిరిగి బడిలో చేర్పించి వారు విద్యావంతులయ్యేలా ఉపాధ్యాయులు, సచివాలయ మహిళా పోలీసులు పనిచేయాలన్నారు. వారిహక్కుల పరిరక్షణకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు.
అనంతరం పాఠశాలలో అమలౌతున్న మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్స్, హాస్టల్‌లో ఉండే విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శాంతకుమారి, హెచ్ఎం శ్రీనివాసరావు, సచివాలయ పోలీసులు, ఉపాధ్యాయులు కెల్లంపల్లి రెడ్డియ్య చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత



ఆర్థిక చేయూతను అందజేస్తున్న వెల్లటూరు హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు

బొల్లాపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థి, చికిత్స పొందుతున్న మరో విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ వంతు వితరణ సోమవారం అందజేశారు. మండలంలోని సరికొండపాలెం తండాకు చెందిన ఇరువురు విద్యార్థులు వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో చదువుతున్నారు. ఇటీవల స్వగ్రామం సరికొండపాలెంతండా నుంచి వెల్లటూరు హైస్కూల్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం సంభవించి ఇరువురు గాయపడ్డారు. వీరిలో పదో తరగతి చదువుతున్న మూడావత్ పెద్ద హనుమాన్‌నాయక్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే స్కూల్లో 9వ తరగతి చదువుతున్న మరో విద్యార్థి చిన్న హనుమాన్‌నాయక్ చికిత్స పొందుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ వంతుగా వారి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత అందజేశామని ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నాగేశ్వరరావు తెలిపారు.

ఘనంగా పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: శ్రీకోలవెన్ను రామకోటేశ్వరరావు సాహితీపీఠం ఆధ్వర్యంలో త్రిభాష పండితుడు డాక్టర్ కాసులనాటి నాగరాజశర్మ రచించిన త్రివేణి, మీనాక్షి పంచరత్నాలు పుస్తకాలను ఆవిష్కరణ నిర్వహించినట్లు సాహితీపీఠం సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి ఇందిరా శాస్త్రీ సోమవారం తెలిపారు. శ్రీనరసరావుపేట కళావేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో త్రిబాష లఘు కావ్యం త్రివేణి పుస్తకాన్ని సాహితీవేత్త డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, మీనాక్షి పంచరత్నాలు పుస్తకాన్ని పి.వి.యస్.ఆర్.ప్రసాదరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీపీఠం వ్యవస్థాపక కార్యదర్శి గంధం యాజ్ఞవల్క్యశర్మ, డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణ మూర్తి, రత్నాకరం రాము, డాక్టర్ కె.వి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేద్దాం

జడ్పీ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాల వద్ద వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని సందర్శించే భక్తులకు సేవచేసేందుకు సమష్టిగా కృషిచేద్దామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం అధ్యక్షతన వివిధ శాఖాధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికీ శాంతిభద్రతలు, వైద్యఆరోగ్యం, రవాణా, విద్యుత్, పరిసరాల పరిశుభ్రత పరంగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేసినప్పుడే ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించగలుగుతామన్నారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభ తరలింపునకు ఏర్పాట్లు

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన జరగనున్న కోటప్పకొండ తిరునాళ్లకు ప్రతి ఏటా మండలంలో పోట్లూరు గ్రామంలో పార్టీలకు కులమతాలకు అతీతంగా విద్యుత్ మొక్కుబడి ప్రభను కోటయ్యకొండకు తరలించటం అనవాయితీ వస్తుంది. వివరాలు మేరకు బ్రిటీష్ కాలంలో పొలాలు విషయంలో వివాదాలు జరిగిన సంఘటనలో పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో కోర్టు వెంబడి సంవత్సరాల తరబడి తిరిగి విసుకెత్తిన గ్రామస్తులు కోటయ్య స్వామిని మొక్కుకొనగా విజయం సాధించారు. దీంతో గ్రామస్తులు ఐక్యంగా ఏటా వంతుల ప్రకారం కోటప్పకొండ తిరునాళ్ళకు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి కొండపై వేంచేసియున్న కోటయ్య స్వామిని గర్భగుడిలోకి వెళ్లి దర్శించుకోవటం అనవాయితీగా వస్తుంది. గత వారం రోజుల నుంచి విద్యుత్ ప్రభకు సంబంధించిన పనులు శరవేగంగా చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 17న గ్రామంలో విద్యుత్ ప్రభ ఊరేగించి అనంతరం తిరునాళ్ల పర్వదినం రోజున ట్రాక్టరుపై కోటయ్యకొండకు తరలించుతామని గ్రామస్తులు వివరించారు.

వినుకొండ నుంచి 60 ప్రత్యేక బస్సులు

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వినుకొండ డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు కె.కోటేశ్వర నాయక్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం వేడుకలకు 60 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. వినుకొండ నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు 35 బస్సులు, శ్రీశైలంకు 14 బస్సులకు త్రిపురాంతకం-06, మన్నెపల్లి-05 బస్సు సర్వీసులు ప్రత్యేకంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు అనుమతితో ఏర్పాటు చేశామన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా వేడుకలు జరుగు ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పౌష్టికాహార బ్యాగ్‌ల పంపిణీ

ఈపూరు: క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని క్షయ వ్యాధి వైద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందజేసిన పౌష్టికాహార బ్యాగ్‌లను గ్రామసర్పంచ్ పల్లమీసాల చెంయ్య, వైద్యాధికారులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు కమలాకర్ మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఒక్కో రోగికి ప్రభుత్వం మందుల రూపంలో రూ.25లక్షలు ఖర్చు చేస్తుందని అన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వం అందజేసే మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు కార్యక్రమంలో వైద్యులు రాంబాబు, సూపర్‌వైజర్ కమల, టెక్నిషియన్ నిరీక్షణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి

శావల్యాపురం: స్త్రీనిధి రుణాలు ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల్లోని మహిళలు ఆర్థిగ ప్రగతి సాధించాలని స్త్రీనిధి మేనేజరు రంతు చిన బుల్లెయ్య అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో మేనేజరు చినబుల్లెయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు మండలాలు రూ.29 కోట్లు రుణాలను 5700 మంది మహిళా సభ్యులకు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 3970 మంది స్వయం సంఘాల్లోని మహిళా సభ్యులకు రూ.18 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. అందులో శావల్యాపురం మండలంలో రూ. 5 కోట్లు రుణాలను 980 మంది సభ్యులకు రుణాలను మంజూరు చేసి జిల్లాలో ప్రథమస్థానం నిలిచినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిరువ్యాపారులైన మహిళలు అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళా సభ్యులు రుణాలు చెల్లింపుల సమయంలో తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. ఆయనతో పాటు సీసీలు ఖజావలీ, బేబిరాణి,రమాదేవి, యానిమేటర్లు ఉన్నారు.

మహిళ బ్యాగులో నగలు చోరీ

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకురాలి బ్యాగులో నుంచి బంగారం ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన మహిళలు మాచర్ల వెళుతూ బస్సు ఎక్కుతున్న సమయంలో బ్యాగు కత్తిరించి అందులోని బంగారు నగలు చోరీ చేశారు. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. చోరీకి గురైన బంగారం విలువ రూ.10 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

యువకుడిపై ముగ్గురు వ్యక్తుల దాడి

చిలకలూరిపేటటౌన్: వ్యక్తిపై దాడి చాకుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన కోఫూరి కృష్ణ బేల్దారు పని చేస్తూ జీవనం కొనసాగిస్తాడు. అదే ప్రాంతానికి చెందిన దుర్గారావుతో గతంలో నుంచి కొన్ని వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో వారం కిందట దుర్గారావు ఆ ప్రాంతం నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్లి పోయాడు. ఆదివారం రాత్రి దుర్గారావు మరో ఇరువురు యువకులతో కలసి మదర్‌థెరిస్సా కాలనీలోని కృష్ణ ఇంటి సమీపంలో చాకుతో పొట్టపై, వీపుపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడు. గమనించిన స్థానికులు గాయపడిన కృష్ణను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం



సాయినాథునికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరం 42వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా సోమవారం సాయినాథునికి నిర్వహించిన తొలిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సాయిబాబాకు కాకడ హారతి, మంగళ స్నానం అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలను సమర్పించి పూజలు జరిపారు.